క్లుప్తంగా

మాతృశక్తి ఆధ్వర్యంలో సీమంతాలు



రామాయంపేట(మెదక్): వీహెచ్‌పీ మాతృశక్తి ఆధ్వర్యంలో శనివారం వెంకటేశ్వరస్వామి ఆలయంలో సీతానవమి నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు మహిళలకు సీమంతాలు చేశారు. అలాగే ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం, వడమాల చందనం, తమలపాకులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా సంయోజక గోపిశెట్టి అనంతలక్ష్మి, సమా సంయోజక పబ్బ చంద్రకళ, శ్రీవాణి, మాతృమూర్తులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న తహసీల్దార్ గంగా ప్రసాద్

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో శనివారం తహసీల్దార్ గంగా ప్రసాద్, ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఏవైనా వివక్ష లాంటి సమస్యలు ఎదురైన సంబంధిత అధికారులకు తెలియజేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గంగాధర్ గౌడ్, ఉపసర్పంచ్ బాబు, కార్యదర్శి నర్సింలు, పోలీస్ సిబ్బంది వేణుగోపాల్, సాయిబాబా, నవీన్, బస్సీలాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి జాతర



బండ్ల ఊరేగింపులో భక్తులు

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం బండ్ల ప్రదర్శన వైభవంగా జరిగింది. వెంకటాపూర్ కళాకారులు జడకొప్పు ఆట ఆడారు. ఉత్సవాలను తిలకించేందుకు ఆయా గ్రామాల నుంచి ప్రజలు రావడంతో ఆలయం ప్రాంగణం జన సంద్రంగా మారింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైపర్ కాలేజీలో క్యాంపస్ ఎంపికలు

నర్సాపూర్: పట్టణంలోని విష్ణు ఫార్మసీ కాలేజీలో శనివారం ఆప్టిమస్ ఫార్మా కంపెనీ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో భాగంగా 50 మంది విద్యార్థులను ఎంపిక చేశారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్ తెలిపారు. ఆప్టిమస్ ఫార్మ కంపెనీ హెచ్‌ఆర్ హెడ్ ప్రవీణ్‌కుమార్ తమ కాలేజీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ కార్యక్రమం చేపట్టగా కాలేజీకి చెందిన నాల్గవ సంవత్సరం చదివే విద్యార్థులను 130 మంది విద్యార్థులు పాల్గొన్నారని, అందులో 50 మంది ప్లేస్‌మెంట్‌లో ఎంపికయ్యారని ఆయన వివరించారు. కాగా క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపికైన విద్యార్థులను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్‌తో పాటు లెక్చరర్లు అభినందించారు.

కాదులూరులో కార్డెన్ సెర్చ్



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టేక్మాల్(మెదక్): మండలంలోని కాదులూరు గ్రామంలో శనివారం ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని ఆదేశాల మేరకు అల్లాదుర్గం సీఐ జార్జ్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ముగ్గురు ఎస్‌ఐలు, 5 మంది ఏఎస్‌ఐలు, 39 మంది పోలీస్ సిబ్బందితో కలిసి నాలుగు బృందాలుగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జార్జ్ మాట్లాడుతూ.. అపరిచితుల వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇందులో సర్పంచ్ పోచ యాదయ్య, ఏస్‌ఐలు రమేశ్, ప్రవీణ్ రెడ్డి, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంగనాథుని జాతర

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో వెలిసిన శ్రీ రంగనాయక స్వామి జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో మొదటి రోజైన ఆదివారం స్వామివారికి బండ్ల ఊరేగింపు, సోమవారం ఎదుర్కొళ్లు, మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం, తదుపరి రథోత్సవం నిర్వహిస్తారు.

పనుల్లో నాణ్యత పాటించడం లేదు

నర్సాపూర్ మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, పక్కన కౌన్సిలర్లు తదితరులు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న మురికికాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని పలువురు కౌన్సిలర్లు మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో ఆరోపించారు. శనివారం మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అధ్యక్షతన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ నయిమోద్దీన్, కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, రాజేందర్, యాదగిరి, రాంచందర్, బుచ్చేష్‌యాదవ్ తదితరులు మాట్లాడుతూ.. పట్టణంలో ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ తదితర నిధులతో చేపడుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యత లేదన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు పర్యవేక్షించరా అంటూ అధికారులను ప్రశ్నించారు. కమిషనర్ వెంకట్‌గోపాల్ స్పందిస్తూ.. పట్టణంలో కొనసాగుతున్న ఆయా అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించామని, నాణ్యత ఉండేలా తనవంతు చర్యలు తీసుకుంటానన్నారు. రూ.ఒక కోటి 12లక్షల 50వేలను మున్సిపాలిటీ సాధారణ నిధులతో పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృదిద్ధ పనులు చేయుటకు కేటాయించాలని తీర్మానించారు. పట్టణంలో కోతుల బెడద తీవ్రంగా ఉన్నదని పలువురు కౌన్సిలర్లు ఎఫ్‌ఆర్‌ఓ అంబర్ సింగ్ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపాలిటీకి హరిత హారానికి మొక్కలు ఇవ్వాలని కమిషనర్ ఎఫ్‌ఆర్‌ఓను కోరగా.. తాము ఎవరికి మొక్కలు ఇవ్వలేమని, తమ అడవుల్లో నాటేందుకు మొక్కలు పెంచుతున్నామని చెప్పారు. నర్సాపూర్‌లో ఆర్టీసీ డిపో ఉన్నప్పటికీ మారుమూల గ్రామాలకు బస్సులు నడపనందున విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు వివరించారు. కొత్త బస్సులకు ప్రతిపాదనలు పంపామని అవి రాగానే గ్రామాలకు బస్సులు నడుపుతామని ఆర్టీసీ ఏడీఈ జోగయ్య తెలిపారు. పట్టణంలో తాగు నీరు సరఫరా తదితర అంశాలపై సమావేశంలో చర్చించి నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని కౌన్సిలర్లు కోరారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాల సేకరణ



మెదక్‌జోన్: పంటలను పరిశీలిస్తున్న అధికారులు



శివ్వంపేట(నర్సాపూర్):శంకర్ తండాలో ..



శివ్వంపేట(నర్సాపూర్): ఉసిరికపల్లిలో ..



రామాయంపేట(మెదక్): నార్సింగిలో..

మెదక్‌జోన్: ఇటీవల కురిసిన అకాలవర్షాలతో నష్టపోయిన పంటలను వ్యవసాయశాఖ విస్తరణ అధికారి శేఖర్ పరిశీలించారు. శనివారం పట్టణ పరిధిలోని నవాబుపేట ప్రాంతంలో నష్టపోయిన వరి పంటలను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు కౌన్సిలర్ లక్ష్మి, ప్యాక్స్ డైరెక్టర్ రాములు, రైతులు ఉన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. భీమ్లా పంచాయతీ శంకర్ తండాకు చెందిన రైతు దశరథ్ తనకున్న 5 ఎకరాల్లోని ధాన్యం బండపైన ఆరబోయగా కురిసిన వర్షానికి కొట్టుకపోయింది. నష్టపోయిన పంటకు పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు.

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలో దెబ్బతిన్న పంటలను బీజేపీ నాయకులు పరిశీలించి బాధిత రైతులను ఓదార్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ కిసాన్‌మోర్చా ప్రతినిధి స్వామిరెడ్డి రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో కురుస్తున్న అకాల వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను ఇన్‌చార్జ్ ఏఓ రాజేష్ పరిశీలించి ధాన్యం వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఏఈఓ మమత, నాయకులు శంకర్‌గౌడ్ తదితరులున్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. కోనాపూర్, ఏటిగడ్డ మాందాపూర్ గ్రామాల్లో రైతుల వివరాలు సేకరించారు. ఇందుకోసం పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలను అందించాలని కోరారు.

వీఓఏల సమస్యలు తీర్చాలి



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

టేక్మాల్(మెదక్): ఐకేపీ వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని టేక్మాల్ మండల ఐకేపీ వీఓల యూనియన్ అధ్యక్షురాలు స్వరూప డిమాండ్ చేశారు. తమ సమస్యలను తీర్చాలని శనివారం జిల్లా కో ఆప్షన్ యూసుఫ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సురేష్, సంజీవరెడ్డి, అశోక్ జగదాంబ, ప్రమోద్, మంజుల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం



ఎంపీకి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చేగుంట(తూప్రాన్): పోచమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు రావాలని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రికను అందించారు. సర్పంచ్ భర్త సిద్ధిరెడ్డితో కలిసి ఉత్సవ కమిటీ సభ్యులు మే 1నుంచి పోతాన్‌పల్లి గ్రామంలో జరిగే పోచమ్మ ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో గ్రామ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు

నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలి

ఎంపీపీ భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

చిన్నశంకరంపేట(మెదక్): అకాల వర్షంతో నష్టపోయిన పంటలకు పరిహారం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ భాగ్యలక్ష్మి కోరారు. శనివారం చిన్నశంకరంపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై ఉన్నంత అధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకునేలా చూస్తానని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, ఎంపీడీఓ ప్రవీణ్, ఏవో లక్ష్మీ ప్రవీణ్, ఎంపీఓ గిరిధర్‌రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీలు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

హాజరుకాని సర్పంచ్‌లు...

చిన్నశంకరంపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి సర్పంచ్‌లు గైర్హాజర్ అయ్యారు. గత సమావేశంలో కూడా సర్పంచ్‌లు, అలాగే అధికారులు సైతం సమావేశానికి గైర్హాజర్ అయ్యారు. గత సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు ఇచ్చినా ఫలితం కనిపించలేదు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న చంపాలాల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీ బ్యాంకు చిట్కుల్ శాఖ మేనేజర్ చంపాలాల్ సూచించారు. మండలంలోని బుజరంపేట గ్రామంలో ఏపీజీవీ బ్యాంకు ఖాతాదారుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా బ్యాంకు ద్వారా అందుతున్న సేవలు, తదితర విషయాలను ప్రజలకు వివరించారు. గ్రామానికి చెందిన శామయ్య మృతి చెందడంతో భీమాకు సంబంధించిన రూ. 20లక్షల చెక్కును నామినీకి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఎంపీటీసీ లింగం, బ్యాంకు అధికారులు దిలీప్, సంఘమేశ్వర్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే వర్షం.. అంతలోనే ఎండ



రంగంపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో మొలకలు వచ్చిన ధాన్యం

కొల్చారం(నర్సాపూర్): కొన్ని రోజులుగా వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పగలంతా ఎండ దంచి కొడితే.. సాయంత్రం వేళల్లో వర్షం పడుతోంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట కోత కోసి అమ్ముకుందామంటే గత నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తడిసిన ధాన్యం కుప్పలోనే మొలకెత్తడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

కార్మికుల కోసం హెల్త్ క్యాంపు

నర్సాపూర్: మే 2న ఆయా రంగాల కార్మికుల కోసం నర్సాపూర్‌లో హెల్త్ క్యాంపు చేపడుతున్నామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సత్యేంద్ర ప్రసాద్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆర్థికసాయం**



నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో అకాల వర్షాలకు ఇళ్లు ధ్వంసమైన బాధితులను శనివారం మండల జెడ్పీటీసీ విజయ్ కుమార్ పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందజేశారు. నిజాంపేట గ్రామానికి చెందిన గుడ్ల రవి, కొమ్మట లక్ష్మణ్ బాధిత కుటుంబాలను ఒక్కొక్కరికి రూ. 5500 చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు అనంతరం నార్లాపూర్ గ్రామానికి చెందిన రాజుకు చికిత్స కోసం రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివ, జీపీ స్వామి, వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, శ్రీకాంత్, ప్రశాంత్, మిరుదొడ్డి బాబు, రమేశ్, లక్ష్మణ్, శ్రీనివాస్, నీలం

◆ **మృతుల కుటుంబాలను ఆదుకుంటాం**

రామాయంపేట(మెదక్): మండలంలోని రామాయంపేట, అక్కన్నపేటలో వేర్వేరు సంఘటనల్లో మృతి చెందిన బీజేపీ కార్యకర్తల కుటుంబాలను శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు రాజశేఖర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.

◆ **జూన్ తొమ్మిదిన బ్రహ్మగర్జన**

రామాయంపేట(మెదక్): తెలంగాణ బ్రహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో జూన్ తొమ్మిదిన హైదరాబాద్‌లో బ్రహ్మగర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్యాకుల శ్రీనివాస్‌శర్మ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున బ్రాహ్మణులు హాజరవుతారని, భవిష్యత్ కార్యచరణ విషయమై ఈసదస్సులో చర్చిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికిగాను మండలాలు, జిల్లాల రీగా కమిటీలు వేసుకొని చర్చించుకోవాలని ఆయన సూచించారు. మన సమస్యల పరిష్కారానికి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

◆ **కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి**



మెదక్‌జోన్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందని పీసీసీ ప్రతినిధులు మ్యాడం బాలకృష్ణ, చౌదరి సుప్రభాత్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, వీవోఏల దీక్షలకు వారు శనివారం మద్దతు పలికారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుంటే ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. మద్దతు పలికిన వారిలో కాంగ్రెస్ నాయకులు రమేశ్‌రెడ్డి, హాఫిజ్, సత్యనారాయణ గౌడ్, శివకుమార్, ప్రసాద్‌గౌడ్, శ్రీహరి తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



చిన్నశంకరంపేట(మెదక్): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



కౌడిపల్లి(నర్సాపూర్): నాగ్సాన్‌పల్లిలో..

చిన్నశంకరంపేట(మెదక్): అకాల వర్షంతో తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాధవి, పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, ఏఓ ప్రవీణ్‌కుమార్, నాయకులు లక్ష్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి, నగేష్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని బచ్చురాజుపల్లి గ్రామంలో ఐకేపీ వారి ఆధ్వర్యంలో మండల దేశెట్టి ఎంపీపీ సిద్ధరాములు, జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సవ్వ, ఉపసర్పంచ్ మల్లేశం, ఏపీఎం వెంకటస్వామి, ఏఈఓ కావేరి, సీసీ లక్ష్మి, స్వప్న, బీఆర్ఎస్ నాయకులు మల్లేశం, లింగం, శివ, సతీష్, స్వామి, రాములు, శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని శేరిపల్లి, కోరంపల్లి గ్రామాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ హర్దీప్‌సింగ్ ప్రారంభించారు. ఇందులో సర్పంచ్‌లు శ్వేత, శ్రీనివాస్, ఎంపీటీసీ మోహన్, డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్, వ్యవసాయాధికారి రాంప్రసాద్, రైతు సంఘం సీఈఓ వెంకటేశం, ఏఈఓ ప్రవీణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని అనంతసాగర్ గ్రామంలో ఎంపీపీ శ్రీనివాస్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘం ఇన్‌చార్జ్ చైర్మన్ రాములు, డైరెక్టర్లు ఆంజనేయులు, చిన్నరాజయ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీసీబీ డైరెక్టర్ గోవర్దన్‌రెడ్డి ఎంపీపీ రాజునాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, జెడ్పీటీసీ కవిత, రైతుబంధు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్, యూత్ అధ్యక్షుడు కృష్ణాగౌడ్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఏఓ స్వప్న, ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, సీఈఓ దుర్గాగౌడ్, డీసీఎంఎస్ ప్రతినిధి భిక్షపతి, ప్రజాప్రతినిధులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



శివ్వంపేట(నర్సాపూర్): చెక్కును అందిస్తున్న సునీతారెడ్డి



మనోహరాబాద్(తూప్రాన్): చెక్కు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

శివ్వంపేట(నర్సాపూర్): పేద, మధ్య తరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు మద్రి మహేందర్‌రెడ్డి, వెంకటేశ్, వీరేష్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్: నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చెక్కులు అందజేశారు.

మనోహరాబాద్(తూప్రాన్): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత అన్నారు. శనివారం మండలంలోని వెంకటాపూర్ అగ్రహారంలో గ్రామానికి చెందిన గంట సంధ్యకు రూ. 55 వేలు విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును, జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయంలో గౌతోజీగూడెం గ్రామానికి చెందిన కర్రె యాదగిరి రూ.13 వేలు విలువైన చెక్కులను అందజేశారు. వీరి వెంట అగ్రహారం సర్పంచ్ రేణుకా, అగ్రహారం, గౌతోజీగూడెం ఉప సర్పంచ్‌లు ఆంజనేయులు, రేణుకుమార్, నాయకులు ఆంజనేయులు యాదవ్, తదితరులున్నారు.

సైబర్ నేరాలపై పోలీసుల కళాజాతా



నిజాంపేట(మెదక్): సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతీ నిత్యం ఎదురవుతున్న రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, మద్యం, బాల్య వివాహాలు, 100 డయల్ ప్రాముఖ్యత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం రాత్రి మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో మేలుకొలుపు కార్యక్రమాన్ని పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు ప్రజలకు వివిధ అంశాలపై పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వినోదరెడ్డి, సర్పంచ్ లక్ష్మీరెడ్డి, ఉపసర్పంచ్ హన్మంత్, నాయకుడు దుర్గారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని దళితవాడలో శనివారం గ్రామస్తులకు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సాయిబాబా, వేణుగోపాల్, నవీన్, ఉప సర్పంచ్ బాబు, లక్ష్మీనర్సింలు, బండారి ఎల్లయ్య, బండారి రాములు, చంద్రయ్య, రామవ్వ, రాజవ్వ, విజయ, శ్రావణి, లావణ్య, లక్ష్మీనర్సింలు, కవిత పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలు సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని ఏఎస్‌ఐ సునీత అన్నారు. పెద్దశంకరంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులను ఎవరైనా వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది రమేశ్ తదితరులున్నారు.

ప్రెస్‌క్లబ్‌ను అన్ని హంగులతో తీర్చిదిద్దుతా

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, పక్కన కలెక్టర్ రాజర్షిషా తదితరులు

మెదక్ రూరల్: జర్నలిస్టుల సంక్షేమాభివృద్ధే ధ్యేయంగా ఏర్పాటు చేస్తున్న ప్రెస్ క్లబ్‌ను అన్ని హంగులతో తీర్చిదిద్దుతామని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అసంపూర్తిగా ఉన్న ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణ పనులకు రూ. 15 లక్షలు మంజూరైన నేపథ్యంలో కలెక్టర్ రాజర్షిషాతో కలిసి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ జగపతి, ఎంపీపీ యమున, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గంగాధర్, రాగి అశోక్, నాయకులు, తదితరులు ఉన్నారు.

పింఛన్ కోసం ఎదురుచూపులు



పోస్టాఫీస్ వద్ద నిరీక్షిస్తున్న పింఛన్ లబ్ధిదారులు

నర్సాపూర్: పింఛన్ సొమ్ము కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రతీనెల మొదటి వారంలో పింఛన్ సొమ్ము చెల్లించాల్సి ఉండగా.. నర్సాపూర్ పోస్ట్ ఆఫీసుకు పింఛన్లు చెల్లించేందుకు జిల్లా పోస్ట్ ఆఫీసు నుంచి డబ్బు సకాలంలో రానందున ఎదురుచూపులు తప్పడం లేదు. పట్టణంలోని లబ్ధిదారులు పోస్ట్ ఆఫీసుకు రోజూ వచ్చి డబ్బు వచ్చిందా అంటు సిబ్బందిని అడగడం, రాలేదని సిబ్బంది నుంచి జవాబు రావడంతో నిరాశతో ఇంటి ముఖం పడుతున్నారు. పట్టణంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇతర లబ్ధిదారులు కలిపి సుమారు 15వందల మంది ఉన్నారు. కాగా పింఛన్ అమౌంట్ చెల్లించేందుకు పోస్ట్ ఆఫీసుకు జిల్లా పోస్ట్ ఆఫీసు నుంచి ఈనెల 27న డబ్బు రావడంతో అదే రోజు పింఛన్ సొమ్ము పంపిణీ ప్రారంభించారు. డబ్బు చెల్లించేందుకు వినియోగించే మిషన్లలో సర్వర్ సరిగా పని చేయనందున డబ్బు చెల్లింపులు జరుగనందున లబ్ధిదారులు మధ్యాహ్నం వరకు పోస్టాఫీసుతో పాటు పక్కన ఉన్న ఇంటి అరుగులపై శనివారం నిరీక్షించారు. ఇదిలాఉండగా పింఛన్ ప్రతీ నెల మొదటి వారంలో చెల్లించాల్సి ఉండగా నెలాఖరున అందజేయడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌చార్జ్ సబ్ పోస్ట్ మాస్టర్ వివరణ

ఈ విషయమై పోస్ట్ ఆఫీసు ఇన్‌చార్జ్ సబ్ పోస్ట్ మాస్టర్ హరిప్రసాద్‌ను వివరణ కోరగా.. జిల్లా పోస్ట్ ఆఫీసు నుంచి డబ్బు రాగానే చెల్లింపులు చేపడుతున్నామని తమ వద్ద జాప్యం జరగడం లేదని ఆయన వివరించారు.